క్లుప్తంగా

కాకుటూరులో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న యువకులు

వెంకటాచలం: మండలంలోని కాకుటూరు వద్దనున్న గ్లోరియస్ క్రైస్ట్ చర్చి ప్రాంగణంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. చెంతాటి స్నేహిత్ షారోన్ జ్ఞాపకార్థం అతని కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సహకారంతో ఈ శిబిరాన్ని నిర్వహించారు. పలువురు యువకులు రక్తదానం చేశారు.

వృద్ధులకు వైద్య పరీక్షలు



పొదలకూరు: స్థానిక లక్ష్మి మహిళా మండలి వృద్ధాశ్రమంలో ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వృద్ధులకు వివిధ వైద్య పరీక్షలను బుధవారం నిర్వహించారు. వృద్ధులు ఆరోగ్య పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని, తరచూ వైద్య పరీక్షలను చేయించుకోవాలని సిబ్బంది సూచించారు. ఏడుగురు వృద్ధులకు కంటికి సంబంధించి క్యాటరాక్ట్ ఆపరేషన్లు అవసరమని గుర్తించి నెల్లూరు జీజీహెచ్‌కు తరలించాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య సహాయకులు ఎం.రాధాకుమారి, సాని శివప్రసాద్, ఎంహెచ్‌పీఓ సుమాజంలి, సచివాలయ ఏఎన్‌ఎం కృష్ణమ్మ, ఆశావర్కర్ ఉష, సీత, లక్ష్మి, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షలకు 95 మంది హాజరు

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) పరిధిలోని అనుబంధ కళాశాలల్లో బుధవారం నిర్వహించిన డిగ్రీ నాలుగో సెమిస్టర్ పరీక్షలకు 95 మంది హాజరయ్యారని ఎగ్జామ్స్ అధికారి డాక్టర్ ఆర్.మధుమతి తెలిపారు. 101 మందికి గానూ 95 మంది హాజరైనట్లు వెల్లడించారు.

ఏఎన్‌ఎంలకు ఉద్యోగోన్నతి

పొదలకూరు: మండలంలోని సచివాలయ ఏఎన్‌ఎంలు ఏడుగురికి ఉద్యోగోన్నతి లభించడంతో ఎంపీడీఓ డీవీ నరసింహారావు బుధవారం రిలీవ్ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామ సచివాలయ ఏఎన్‌ఎంలుగా పనిచేస్తున్న వారికి ప్రభుత్వం ఉద్యోగోన్నతి కల్పించి వైద్యారోగ్య శాఖకు బదిలీ చేసినట్టు తెలిపారు. వారు తమకు కేటాయించిన మండలాలకు వెళ్లడం జరుగుతుందన్నారు. అయితే కొత్త ఏఎన్‌ఎంలు వచ్చేంత వరకు బదిలీ అయిన వారు ఇక్కడే విధులను నిర్వహిస్తారన్నారు.

పది పరీక్షలకు విద్యార్థుల గైర్హాజరు

ముత్తుకూరు: మండలంలోని నాలుగు పరీక్ష కేంద్రాల్లో బుధవారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఎంఈఓ మధుసూదన తెలిపారు. హిందీ పరీక్షకు 679 మందిగానూ 671 మంది హాజరయ్యారని వెల్లడించారు

- **ఇందుకూరుపేట:** పదో తరగతి పరీక్షలకు బుధవారం ఆరుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ వెంకటేశ్వరనాయక్ తెలిపారు. జెడ్పీ ఉన్నత పాఠశాలలో నూరుశాతం విద్యార్థులు హాజరయ్యారని, ఎంకేఆర్ ఉన్నత పాఠశాలలో నలుగురు, నరసాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇద్దరు విద్యార్థులు గైర్హాజరయ్యారన్నారు. మొత్తంగా 473 మంది విద్యార్థులకు 467 మంది హాజరైనట్లు వివరించారు.

యువజన విభాగ అధ్యక్షుడిగా రాఘవ



బుచ్చిరెడ్డిపాళెం : వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండలాధ్యక్షుడిగా చెల్లాయపాళెనికి చెందిన కోవూరు రాఘవను నియమిస్తున్నట్లు మాజీ మంత్రి, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.

సునీతా విలియమ్స్ రాకపై హర్షం



బుచ్చిరెడ్డిపాళెం: అంతరిక్షంలో అద్భుత పరిశోధన కోసం వెళ్లిన వ్యోమగామి సునీతా విలియమ్స్ సురక్షితంగా భూమిపైకి తిరిగిరావడంతో బుచ్చిరెడ్డిపాళెంలోని రామచంద్రాపురం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు బుధవారం సంబరాలు చేసుకున్నారు. ఈ క్రమంలో కలాం పురస్కార గ్రహీత గండికోట సుధీర్‌కుమార్ మాట్లాడుతూ సునీత విలియమ్స్ జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం ఆమె గురించి విద్యార్థులకు వివరించారు.

ఉపయోగం లేకుండా..

- ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎన్నో నిబంధనలు
- శాంపిల్స్‌కే పరిమితమైన ఫైనం
- దళారులకే ధాన్యాన్ని అమ్ముకోవాల్సిన పరిస్థితి
- అయోమయంలో అన్నదాతలు



వెలవెలబోతున్న నరుకూరు ధాన్యం కొనుగోలు కేంద్రం

తోటపల్లిగూడూరు: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు వెలవెలబోతున్నాయి. అక్కడ ధాన్యం విక్రయించేందుకు సవాలక్ష నిబంధనలు పెట్టడంతో రైతన్నలు అల్లాడిపోతున్నారు. మండలంలో 11 సచివాలయాల పరిధిలో గత నెల 15వ తేదీన అధికారులు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. అన్నదాతలు అక్కడికి ధాన్యం తరలించి మద్దతు ధర పొందాలని అధికారులు సమావేశాలు పెట్టి రైతులకు చెప్పారు. గ్రేడ్ ఏ రకం ధాన్యానికి క్వింటాకు రూ.2,320లు, పుట్టికి రూ.19,720లు, సాధారణ రకం క్వింటాకు రూ.2,300లు, పుట్టికి రూ.19,550లుగా ప్రభుత్వం ప్రకటించింది.

కేంద్రాల్లో ఇలా..

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర విషయంలో ప్రభుత్వం నాణ్యతా ప్రమాణాల పేరుతో రైతుల మెడకు నిబంధనల ఉచ్చు బిగించింది. నెమ్ము 17 శాతం లోపు ఉండాలని, దుమ్ము, ధూళి, మట్టి, రాళ్లు, చెత్త, తప్ప, తాలు ఒక శాతానికి మించకూడదని, దెబ్బతిన్న, రంగుమారిన, చెడిపోయిన, మొలకెత్తిన, పురుగు పట్టిన ధాన్యం 5 శాతం లోపు ఉండాలనే నిబంధనలను విధించింది. అలాగే కుచించుకుపోయిన, వంకరపోయిన ధాన్యం 3 శాతానికి మించకూడదని, కల్తీ, కేళి ఇతర తక్కువ రకాల ధాన్యం 6 శాతం లోపు మేర మాత్రమే ఉండాలని నిర్దేశించింది. ఆయా ప్రమాణాల్లో తేడా ఉంటే మద్దత ధర కంటే తగ్గించి ధాన్యాన్ని కొనుగోలు చేయాల్సి ఉంటుందని అధికారులు నిబంధనలు విధించారు.

505 పుట్లు మాత్రమే..

ఈ ఏడాది రబీ సీజన్‌కు సంబంధించి మండలంలో 12 వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. సుమారు 35 వేల పుట్ల నుంచి 40 వేల పుట్ల వరకు దిగుబడి రావొచ్చని అంచనా వేస్తున్నారు. కాగా ముందస్తుగా నాట్లు వేసిన పొలాల్లో ఇప్పటికే వరి కోతలు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికే సుమారు 10 వేల పుట్లకు పైగా ధాన్యం దిగుబడి వచ్చింది. అయితే కేంద్రాలను ఏర్పాటు చేసి హడావుడి చేస్తున్న అధికారులు రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేసింది కేవలం 505 పుట్లు మాత్రమే. 14 కేంద్రాల్లో పదిచోట్ల ఇంకా కొనుగోలు జరగలేదు. కేంద్రాలు ప్రారంభమై నెల దాటినా 10 వేల పుట్లకు పైగా ధాన్యం కల్లాల్లోకి వచ్చినా ఇప్పటికి కనీసం వెయ్యి పుట్లు కూడా కొనుగోలు చేయలేక పోయారంటే నిబంధనలు ఏ మేరకు రైతులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయో అర్థం చేసుకోవచ్చు. కూలీల ఏర్పాటు, రవాణా ఖర్చులు రైతులే భరించాల్సి ఉండటంతో పాటు నెమ్ము 17 శాతానికి మించి ఉంటే మద్దతు ధరలో కోత విధిస్తుండంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో దళారుల వైపే మొగ్గు చూపుతున్నారు. వారి వద్ద ధాన్యం ధరలు ఆశాజనకంగా లేకున్నా కొనుగోలు కేంద్రాల్లో నిబంధనలకు భయపడి అమ్ముకోవాల్సి వస్తోంది.

నిబంధనలను సడలించాలి



గతేడాది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.22 వేలకు పైగా పలికిన ధాన్యం ధరలు నేడు రూ.16 వేలకు మించడం లేదు. దళారులు చెప్పిందే వేదంగా ఉంది. ధరలు రోజురోజుకు పతనమవుతున్నాయి. పోనీ కొనుగోలు కేంద్రాల్లో విక్రయిద్దామంటే ప్రభుత్వ నిబంధనలతో వాటి దగ్గరికే పోలేకున్నాం. దీంతో కల్లాల్లోనే దళారులకు ధాన్యాన్ని అమ్ముకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. పెట్టుబడులు భారీగా పెరిగిన ప్రస్తుత తరుణంలో నష్టాలు తప్పేలా లేవు. ప్రభుత్వం నిబంధనలు సడలిస్తే కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించేందుకు అవకాశం ఉంటుంది.

– మన్నెం చిరంజీవులగౌడ్, రైతు, తోటపల్లిగూడూరు



ధాన్యాన్ని మిల్లుకు తరలిస్తున్న దళారులు



రైతుల కోసం ఎదురు చూస్తున్న పేడూరు సొసైటీ అధికారులు

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు



ఎండ తీవ్రతకు జన సంచారం లేని గేటుసెంటరు

పొదలకూరు: పొదలకూరు ప్రాంతంలో ఉష్ణోగ్రతలు నానాటికీ పెరుగుతున్నాయి. ఈ ఏడాది ఎండలు గతేడాది కంటే అధికంగా ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ ప్రాంతానికి వెలిగొండలు దగ్గరగా ఉండటం, మెట్టప్రాంతం కావడంతో సాధారణం కంటే ఒకటి, రెండు డిగ్రీలు అదనంగా ఉంటున్నాయి. ఉదయం 11.30 గంటల తర్వాత తీవ్రత పెరుగుతోంది. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు బయటకు రావొద్దని చెబుతున్నారు. తప్పని పరిస్థితుల్లో తలపై తువాలు, టోపీలు ధరించాల్సిందిగా వైద్యులు పేర్కొంటున్నారు. అలాగే గొడుగులు వేసుకుని వెళ్లడం మంచిందటున్నారు. వడదెబ్బ నుంచి రక్షణ కోసం తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించుకోండి



తలమంచిలో ధాన్యాన్ని పరిశీలించి మాట్లాడుతున్న ఏఓ

కొడవలూరు: బీపీటీ-5204 వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలోనే విక్రయించుకోవాలని ఏఓ లక్ష్మి రైతులకు సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని నార్తురాజుపాళెం, తలమంచి గ్రామాల్లో కళ్లాల్లోని ధాన్యాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. బీపీటీ రకానికి మార్కెట్‌లో ధర నిరాశాజనకంగా ఉన్నందున కొనుగోలు కేంద్రంలో విక్రయించుకోవడం ద్వారా మద్దతు ధర పొందాలన్నారు. తేమ శాతం విషయంలో రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావల్సిన అవసరం లేదన్నారు. వీఏఏలు ప్రసాద్, శివజ్ఞాన ఉన్నారు.

సీహెచ్‌సీలో మెరుగైన సేవలు



మాట్లాడుతున్న ఆస్పత్రి సూపరింటెండెంట్

కోవూరు: కోవూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటచలపతి గౌడ్ అన్నారు. కోవూరు సీహెచ్‌సీలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ అన్ని విభాగాలకు సంబంధించి నైపుణ్యం కలిగిన వైద్యులు ఉన్నారని, సకాలంలో వారి సేవలను ఉపయోగించుకోవాలన్నారు. గుండెపోటుకు సంబంధించి అత్యవసర పరిస్థితుల్లో టెన్ ప్లస్ ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నాయన్నారు. అనంతరం ఆస్పత్రి పరిసరాల్లో మొక్కల పెంపకం, పరిసరాల పరిశుభ్రతలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా గ్రావెల్ తోలించేలా తీర్మానం చేశారు. అదేవిధంగా ఆస్పత్రికి అవసరమైన కంప్యూటర్లు కొనుగోలు చేసేందుకు తీర్మానం చేశారు. సమావేశంలో ఎంపీడీఓ శ్రీహరిరెడ్డి, వైద్యుడు వంశీకృష్ణ, అభివృద్ధి కమిటీ సభ్యులు మల్లికార్జున్‌రెడ్డి, మల్లారెడ్డి, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కట్టువపల్లిలో ఎన్‌ఐఆర్‌డీపీఆర్ బృందం పర్యటన



ఎన్‌ఐఆర్‌డీపీఆర్ బృందంతో మహిళా ప్రజాప్రతినిధులు

మనుబోలు: మండలంలోని కట్టువపల్లి గ్రామ పంచాయతీని హైదరాబాద్‌కు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్ బృందం బుధవారం సందర్శించింది. ఎన్‌ఐఆర్‌డీపీఆర్‌కు చెందిన డాక్టర్ ఎస్‌కే సత్యప్రభ తమ బృందంతో కలిసి ఎక్స్‌క్లూజివ్ ఆల్ ఉమెన్ పంచాయత్స్ ఇన్ రూరల్ గవర్నెన్స్ అనే అంశంపై పరిశోధన చేసేందుకు గ్రామ సర్పంచ్‌తోపాటు ఎనిమిది మంది వార్డు సభ్యులు కూడా మహిళలే ఉన్న కట్టువపల్లి పంచాయతీని సందర్శించారు. దీని పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు, పొదుపు సంఘాల గురించి అడిగి వివరాలు తెలుసుకున్నారు. మహిళలతో చర్చించి వారికి అందుతున్న రుణాలు, స్వయం సమృద్ధి తదితర విషయాలను ఆరాతీశారు. స్థానికంగా నలుగురు ఇన్వెస్టిగేటర్లను నియమించి వారి ద్వారా కొన్ని కుటుంబాల వివరాలను నమోదు చేసే ప్రక్రియను చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎస్.భారతమ్మ, ఎంపీడీఓ జలజాక్షి, ఏపీడీ ప్రసాద్, ఈఓపీఆర్డీ నారాయణ, పంచాయతీ కార్యదర్శి దీపిక తదితరులు పాల్గొన్నారు.

వైవీ సుబ్బారెడ్డికి ప్రసన్న పరామర్శ



మేదరమెట్లలో వైవీ సుబ్బారెడ్డిని పరామర్శిస్తున్న ప్రసన్న

మేదరమెట్ల: రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డిని కోవూరు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. వైవీ సుబ్బారెడ్డి మాతృమూర్తి యర్రం పిచ్చమ్మ సోమవారం కన్నుమూశారు. ఈ క్రమంలో కొరిశపాడు మండలం మేదరమెట్ల గ్రామంలోని ఎంపీ నివాసంలో బుధవారం ఆమె చిన్న కర్మ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రసన్న ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైవీ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

యువతి అదృశ్యం

వెంకటాచలం: మండలంలోని తిక్కవరప్పాడు పంచాయతీ పరిధిలో మల్లిగుంటసంఘం గ్రామానికి చెందిన ఓ యువతి అదృశ్యంపై ఆమె తల్లి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉచిత దంత వైద్య శిబిరం నేడు

పొదలకూరు: వరల్డ్ ఓరల్ హెల్త్‌డే సందర్భంగా స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఉదయం ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తామని సూపరింటెండెంట్ డాక్టర్ యు.ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరానికి దంత వైద్య నిపుణులు హాజరై అన్ని రకాల దంత పరీక్షలను నిర్వహిస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

వసతుల్లేక.. రోడ్లపైనే ధాన్యం ఆరబోత



రిలయన్స్ రోడ్డుపై ఇలా..

ముత్తుకూరు: మండలంలో వరి కోతలు జోరుగా జరుగుతున్నాయి. రైతులు, కూలీలు ధాన్యం ఎండబెట్టడంలో బిజీగా ఉన్నారు. రబీ సీజన్ కింద 9,400 ఎకరాల్లో వరి సేద్యం జరిగింది. అయితే ధాన్యం తేమశాతం తగ్గించుకొనేందుకు రైతులు నానా పాట్లు పడుతున్నారు. సరైన వసతులు లేకపోవడంతో రోడ్లపైనే ఆరబెట్టాల్సిన దుస్థితి వచ్చింది. బుధవారానికి మండలంలో 35 శాతం కోతలు జరిగాయి. ఎకరాకు 3.5 నుంచి 4 పుట్ల దిగుబడి వస్తోంది. ఎండబెట్టిన ధాన్యాన్ని అమ్మకం చేసేందుకు వ్యాపారుల కోసం రైతులు నిరీక్షిస్తున్నారు.



బలిజపాళెం రోడ్డులో కుప్పలుగా పోసిన ధాన్యం

స్కూటీని ఢీకొన్న కారు

- దంపతులకు తీవ్రగాయాలు



చికిత్స పొందుతున్న పెంచలయ్య

కోవూరు: ఆగిఉన్న స్కూటీని కారు వేగంగా ఢీకొనడంతో ఇద్దరికి తీవ్రగాయాలైన ఘటన కోవూరు జాతీయ రహదారి సమీపంలోని ఓ హోటల్ వద్ద బుధవారం సాయంత్రం జరిగింది. పోలీసుల సమాచారం మేరకు.. రాజుపాళెనికి చెందిన పెంచలయ్య, భారతి దంపతులు పనినిమిత్తం స్కూటీపై నెల్లూరుకు బయలుదేరారు. ఈ క్రమంలో కోవూరు పరిధిలోని ఓ హోటల్ వద్ద నిలిపి ఉన్న వాహనం వద్దకు స్కూటీ వచ్చి ఆగింది. అదే సమయంలో అదే సమయంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు స్కూటీని ఢీకొట్టింది. దీంతో దంపతులకు తీవ్రగాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో నెల్లూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. ఎస్సై రంగనాథ్‌గౌడ్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన కారును డ్రైవర్ హితేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అంబరాన్నంటిన వజ్రోత్సవ సంబరం

- డీకేడబ్ల్యూ కళాశాలలో ఘనంగా 60 వసంతాల వేడుక
- తరలివచ్చిన పూర్వ విద్యార్థినులు



జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మను సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

నెల్లూరు(టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ కళాశాల ఏర్పడి 60 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో వజ్రోత్సవ వేడుకలు బుధవారం అంబరాన్నంటాయి. ఈ కళాశాలలో చదివి వివిధ రంగాల్లో ఉన్నత స్థాయికి ఎదిగిన వారు ఒక్కచోట చేరి వారి ఆనందాలను పంచుకున్నారు. తొలుత అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. అనంతరం ఏఐ సహాయంతో కళాశాల విద్యార్థినులు జయాంజలి, భాను రూపొందించిన దొడ్ల కౌసల్యమ్మ సందేశాన్ని వినిపించారు.

కళాశాల అభివృద్ధికి తోడ్పాటునందించాలి

డీకేడబ్ల్యూ కళాశాలలో చదువుకున్న ఎందరో నేడు ఉన్నత స్థానాల్లో ఉన్నారని, వారంత కళాశాల అభివృద్ధికి తోడ్పాటును అందించాలని వీఎస్‌యూ వీసీ అల్లం శ్రీనివాసరావు కోరారు. డీకేడబ్ల్యూ కళాశాల ప్రిన్సిపల్‌గా పనిచేసిన డాక్టర్ శారతకు తాను శిష్యుడని, ప్రస్తుతం ఇక్కడ ఉండడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. నూతన విద్యా విధానం లక్ష్యాలను విద్యార్థులకు మరింత చేరువ చేసి కళాశాలను అభివృద్ధి పథంలో నడిపించాలన్నారు.

ఇక్కడే చదివాను

జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ తాను డీకేడబ్ల్యూ కళాశాలలో చదవానని, మా కుటుంబానికి, కళాశాలకు ఎంతో అనుబంధం ఉందన్నారు. కళాశాల అభివృద్ధిలో మా వంతు సహాయ, సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయన్నారు.

పూర్వ విద్యార్థినుల సహకారం అభినందనీయం

నగర మేయర్ పొట్లూరి స్రవంతి మాట్లాడుతూ డీకేడబ్ల్యూ కళాశాలలో చదువుకున్న వారు నేడు అన్ని రంగాల్లో ముందున్నారని, ప్రస్తుతం పూర్వ విద్యార్థులు అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ గిరి మాట్లాడుతూ 60 వసంతాల చరిత్రలో ఎందరో మహిళామణులు ఉన్నత శిఖరాలు అధిరోహించారన్నారు. ఎన్‌ఈపీ మార్గదర్శకాలకు అనుగుణంగా ఒక చేతితో డిగ్రీ, మరో చేతితో ఉద్యోగావకాశం అనే నినాదంతో ముందుకు సాగుతున్నామన్నారు. కళాశాల పూర్వ విద్యార్థిని, మంత్రి నారాయణ సతీమణి ఇందిర మాట్లాడుతూ ఎందరో స్త్రీల జీవితాల్లో వెలుగులు నింపిన దొడ్ల కౌశల్యమ్మ దాతృత్వానికి రుణపడి ఉన్నామన్నారు. కళాశాల పూర్వ విద్యార్థిని, రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి సతీమణి సునంద మాట్లాడుతూ స్త్రీ విద్యాభివృద్ధికి డీకేడబ్ల్యూ కళాశాల కృషి గణనీయమైనదన్నారు. పూర్వ విద్యార్థినుల సంఘం అధ్యక్షురాలు జ్యోతిరెడ్డి, కార్యదర్శి కుసుమకుమారి మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు కృషి చేయాలని కోరారు. అనంతరం అతిథులు, పూర్వ అధ్యాపకులను సన్మానించారు.



సెల్ఫీ దిగుతూ..

జ్ఞాపకాలను నెమరేసుకుంటూ..

కళాశాల ఏర్పడిన నాటి నుంచి చదువుకున్న ఎందరో పూర్వ విద్యార్థినులు ఒకేచోట కలుసుకుని పాత జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. సెల్ఫీలు తీసుకుని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఎన్నో ఏళ్ల తరువాత కలవడంతో తమ భావోద్వేగాలను పంచుకోవడంతో పాటు తమ సంతోషాలను వ్యక్తం చేసుకున్నారు.